నేరాలకు హాట్‌స్పాట్‌గా కావలి

నిఘా వ్యవస్థ నిస్తేజం

- చెలరేగిపోతున్న దొంగలు, ఆర్థిక మోసగాళ్లు
- కేసుల ఛేదనలో పోలీసుల వైఫల్యంపై విమర్శలు



కావలిలో ఓ ఇంట్లో దొంగలు పగులగొట్టిన బీరువాను పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్‌)

కావలి: పట్టణం నేరాలకు హాట్‌స్పాట్‌గా మారింది. నిఘా వ్యవస్థ నిస్తేజంగా మారడం.. పోలీసు వ్యవస్థ నేరాలను ఛేదించడంలో విఫలమవడంతో దొంగలు చెలరేగిపోతున్నారు. మరోవైపు ఆర్థిక మోసగాళ్లు తమ చేతివాటం చూపుతున్నారు. వస్త్ర వ్యాపారంలో మినీముంబయిగా ప్రసిద్ధి చెందిన కావలిలో గడిచిన రెండేళ్లుగా వరుస చోరీలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నా పోలీసు యంత్రాంగం స్పందించడం లేదు. బాధితులకు సర్ది చెప్పడం, నేర తీవ్రతను తగ్గించి కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం తప్ప నేరాలకు అడ్డుకట్ట వేసే దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో కట్టుదిట్టమైన భద్రత ఉండే బృందావనం కాలనీలో రెండేళ్ల కిందట కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తుండగా లోపలికి ప్రవేశించిన దుండగుడు సుమారు రూ.80లక్షలకుపైగా విలువైన బంగారం, నగదు చోరీ చేసి దర్జాగా వెళ్లిపోయాడు. ఈ కేసులో ఇప్పటి వరకు పోలీసులు ఎలాంటి పురోగతి సాధించలేదు. చోరీ అనంతరం దొంగ దర్జాగా ఆర్టీసీ బస్సెక్కి విజయవాడ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో నమోదైనా పట్టుకోలేకపోయారు. ఈ ఘటన తరువాత దొంగతనాలకు కావలి హాట్‌స్పాట్‌గా మారింది. ఆ తరువాత వరుసగా ముసునూరు, గౌరవరం, కావలి రైల్వేస్టేషన్‌ పరిసర ప్రాంతాల్లో దొంగతనాలు చోటుచేసుకున్నాయి. చైన్‌ స్నాచింగ్‌లు, దుకాణాల్లో దొంగతనాలతో పాటు ద్విచక్ర వాహనాల అపహరణ కేసులు అయితే లెక్కే లేదు. 2023, 2024లో జరిగిన దొంగతనాల కేసుల్లో నేరస్తులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారు. దీంతో ఈ ఏడాది వేసవి ప్రారంభం నుంచే దొంగలు చెలరేగిపోతూ పోలీసులకు సవాల్‌ విసురుతున్నారు. గత నెల 10వ తేదీ పెదపవని బస్టాండ్‌ సమీపంలోని ఓ ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఆ తరువాత రెండు రోజుల వ్యవధిలో పట్టపగలే తుమ్మలపెంట రోడ్డులోని ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. స్కూటీపై వచ్చిన దుండగుడు ఉదయం పది గంటల సమయంలో తలుపులు పగులకొట్టి 35 సవర్లకుపైగా బంగారాన్ని చోరీ చేసి పారిపోయాడు. ఈ ఘటన జరిగిన మూడురోజులకే అంటే గత నెల 15వ తేదీన రామ్మూర్తిపేటలోని ఓ ఇంట్లో దొంగలు పడి 60 గ్రాముల వరకు బంగారాన్ని చోరీ చేశారు. తాజాగా ఈ నెల 17వ తేదీన పట్టపగలే నాలుగు ఇళ్లలో దొంగలు పడి 55 సవర్ల బంగారం, వెండి, నగదు చోరీ చేశారు. వరుస చోరీల ఘటనల నేపథ్యంలో పట్టణ ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేరాలకు సంబంధించి పోలీసులు ఇంత వరకు కనీసం అనుమానితులను కూడా గుర్తించకపోవడం గమనార్హం. శరవేగంగా అభివృద్ధి చెందుతున్న కావలిలో కీలకమైన చోరీల్లో ఇంత వరకు ఒక్క కేసులో కూడా నేరస్తులను పట్టుకోలేకపోవడం, చోరీకి గురైన సొత్తును రికవరీ చేయడంలో పోలీసు యంత్రాంగం చేతులెత్తేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. పాత నేరస్తుల కదలికలపై నిఘా కొరవడడం, ఇన్‌ఫార్మర్‌ వ్యవస్థకు తిలోదకాలు ఇవ్వడం, కేవలం సాంకేతిక దర్యాప్తుపైనే ఆధారపడడంతో కేసులు కొలిక్కి రావడం లేదు. దీంతో పోలీసులపై ప్రజలు నమ్మకం కోల్పోతున్నారు. చిన్నచిన్న దొంగతనాల విషయంలో కనీసం ఫిర్యాదు చేసేందుకు కూడా ముందుకు రావడం లేదు.



దొంగతనం జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం(ఫైల్‌)

చేతివాటం చూపుతున్న ఆర్థిక మోసగాళ్లు

ఈ ఏడాది ప్రారంభంలోనే కావలిలో భారీ ఆర్థిక నేరం వెలుగుచూసింది. ముసునూరు కేంద్రంగా వెలుగు చూసిన ఈ నేరంలో పోలీసులే పాత్రధారులుగా, బాధితులుగా ఉండడం గమనార్హం. దీంతో పాటు తాజాగా షేర్‌ మార్కెట్‌లో పెట్టుబడుల కోసం అంటూ అధిక వడ్డీలు ఆశ చూపి భారీ మొత్తం కొట్టేసి మోసం చేసిన మరో ఘటన సైతం పట్టణ ప్రజలను నివ్వెరపరిచింది. మరోవైపు పట్టణంలోని అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని సైబర్‌ నేరగాళ్లు తమ చేతివాటం చూపుతూ వారి ఖాతాల్లో నుంచి నగదును దోచేస్తున్నారు. ఈ ఘటనలకు సంబంధించి పోలీసులు ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేకపోయారు.

కనిపించని ఖాకీలు

పోలీసుశాఖలో విజిబుల్‌ పోలీసింగ్‌కు అత్యంత ప్రాధాన్యత ఉంది. రద్దీ ప్రదేశాలు, శివారు ప్రాంతాలు, తరచుగా నేరాలు జరిగే ప్రాంతాలు, రైల్వే స్టేషన్‌, బస్‌స్టాండ్‌ పరిసరాలు, ప్రముఖ ఆలయాలు, మార్కెట్ల వద్ద పోలీసులు ఖాకీ దుస్తుల్లో కనిపిస్తుంటే తప్పు చేయాలనుకునే వారిలో భయం కలుగుతుంది. నేరాలు చేసేందుకు వచ్చిన వాళ్లు కూడా పోలీసులను చూసి వెనుకడుగు వేస్తారు. అయితే కావలిలో మాత్రం ఖాకీలు ఎక్కడా కనిపించడం లేదు. వరుస నేరాలతో హాట్‌స్పాట్‌లుగా మారిన ప్రాంతాల్లో కూడా గస్తీ కనిపించడం లేదు. నేర నియంత్రణలో కీలకమైన సీసీ కెమెరాలు కూడా చాలా చోట్ల పనిచేయడం లేదు. దొంగతనాలు జరిగినప్పుడు హడావిడి చేయడం తప్ప నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో చోటు చేసుకున్న చోరీ కేసులు, ఆర్థిక మోసాలకు సంబంధించిన ఫిర్యాదుల పురోగతిపై ఒకటో పట్టణ స్టేషన్‌ సీఐ ఎండీ ఫిరోజ్‌ను ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

నిఘాను పటిష్టం చేయాలి



పట్టణంలో నేరాల కట్టడికి పోలీసు నిఘాను పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది. పట్టణంలోని అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలి. పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపార సంస్థలు, సేవాదృక్పథం ఉన్న వ్యక్తులు ముందుకొచ్చి పోలీసులకు సహకరించాలి.

– కూనం తాతిరెడ్డి, కావలి

క్లుప్తంగా

మధుసూదన్‌ కుటుంబానికి ప్రభుత్వ సాయం అందజేత



కావలి: కాశ్మీర్‌లో ఉగ్రదాడిలో అశువులు కోల్పోయిన పట్టణానికి చెందిన మధుసూదన్‌ కుటుంబ సభ్యులను నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి, నుడా చైర్మన్‌ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆదివారం పరామర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.10 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ఉగ్రదాడిలో మధుసూదన్‌ అశువులు కోల్పోవడం దురదృష్టకరమన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు కేంద్ర ప్రభుత్వం తరపున అందాల్సిన సదుపాయాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మకు పొంగళ్లు




ఉదయగిరి: గండిపాళెంలో జలాశయం సమీపంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న గంగమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు గంగమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు వేకువజామున కొత్తబుట్టల్లో పొంగళ్ల సామగ్రిని పెట్టుకుని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. వైఎస్‌ఎంపీపీ గుంటుపల్లి మాలకొండయ్యచౌదరి, ఆలయ కమిటీ చైర్మన్‌ పాముల రమణయ్య, బొందికాళ్ల వెంకటరమణ, పాముల శ్రీను, రాజా, యాదవ యూత్‌ నాయకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



దుత్తలూరు: కారు ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటన దుత్తలూరు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో 565వ నంబర్‌ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు..ప్రకాశం జిల్లా మోపాడుకు చెందిన సీహెచ్‌ సుబ్బారామయ్య మోటార్‌ సైకిల్‌పై బద్వేలుకు వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో దుత్తలూరు విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ సమీపంలో పామూరువైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు వెనుకగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సుబ్బారామయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి హైవే అంబులెన్స్‌కు సమాచారం అందించగా క్షతగాత్రుడ్ని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఎలక్ట్రికల్‌ ట్రైసైకిళ్ల పంపిణీ



కావలి: కావలి నియోజకవర్గంలోని 160 మంది దివ్యాంగులకు ఎలక్ట్రికల్‌ ట్రైసైకిళ్లను వీపీఆర్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. స్థానిక క్రీడా శాఖ మైదానంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, నుడా చైర్మన్‌ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డితో కలిసి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు ఆళహరి సుధాకర్‌, తదితరులు పాల్గొన్నారు.

మామిడిచెట్ల కాలనీలో తాగునీటి ఎద్దడి



సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల పంచాయతీలోని మామిడిచెట్ల కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొంది. కాలనీలో సుమారు 25 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కాలనీకి మంచినీటిని అందించే బోరు మోటార్‌ నాలుగు రోజుల క్రితం మరమ్మతులకు గురైంది. అప్పట్నుంచి కాలనీవాసులు సుదూరంగా ఉన్న బోరు,వాటర్‌ ప్లాంట్‌ వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. మోటారుకు మరమ్మతులు చేయించాలని పలు మార్లు పంచాయతీ అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. మండలాధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

భగవద్గీత మానవాళికి మార్గదర్శకం



ఆత్మకూరురూరల్‌: భగవద్గీత సర్వ మానవాళికి మార్గదర్శకంగా నిలుస్తుందని త్రైత సిద్ధాంత ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మండలంలోని నబ్బీనగరంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం వారు ప్రచారం నిర్వహించారు. శ్రీకృష్ణుడు జ్ఞానం, అజ్ఞానానికి మధ్యన తేడాను వివరిస్తూ ప్రబోధించిన భగవద్గీతను ప్రతిఒక్కరూ అనుసరించాలని కోరారు. సిద్ధాంత ప్రబోధసేవా సమితి దుత్తలూరు శాఖ అధ్యక్షుడు ప్రసాద్‌, కమిటీ సభ్యులు సుధాకర్‌, పెంచలరత్నం, నాగమ్మ, మహేందర్‌, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో బోరు ఏర్పాటు



ఆత్మకూరు: మున్సిపల్‌ పరిధిలోని వెంకట్రావుపల్లిలోని శ్మశాన వాటికలో పట్టణానికి చెందిన నలిశెట్టి శ్రీధర్‌ తన సొంత నిధులతో ఆదివారం బోరు ఏర్పాటు చేశారు. మరో రెండు రోజుల్లో చేతిపంపును బిగించి వినియోగంలోకి తీసుకొస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

నిస్వార్థ సేవను అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న కంచి పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: మానవ జన్మ ఎత్తినందుకు ఉన్నంతలో తోటివారికి నిస్వార్థంగా సేవ చేయడాన్ని ప్రతిఒక్కరూ అలవర్చుకోవాలని సాంబశివ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ కంచి పరమేశ్వరరెడ్డి అన్నారు. పట్టణంలోని అలఘునాథస్వామి ఆలయంలోని నూతన కల్యాణ మండపంలో తెలుగుభారతి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మంచిమాట కార్యక్రమానికి ఆయన ముఖ అతిథిగా హాజరయ్యారు. మానవసేవయే మాధవ సేవ, ధ్యానం, ఆధ్యాత్మిక జీవితం అనే అంశాలపై ప్రసంగించారు. మానవుడికి సేవ చేయడమంటే దేవుడికి సేవ చేసినట్లేనని, ప్రతి మనిషిలోనూ దేవుడిని చూడాలన్నారు. నిరహంకార భావంతో స్వప్రయోజనాలు ఆశించకుండా తోటి వారికి సహాయపడడమే మాధవసేవ అవుతుందన్నారు. తాను ఉన్నంతలో ట్రస్ట్‌ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానంటే కేవలం భగవంతుడి ఆశీర్వాదం, తోటివారి సహకారంతోనని పేర్కొన్నారు. మనస్సును ఏకాగ్రతతో దైవస్వరూపంపై కేంద్రీకరించడమే ధ్యానమన్నారు. దానితో ఆత్మవిశ్వాసం, మనోనిబ్బరం పెరుగుతాయని, మనశ్శాంతి కలుగుతుందన్నారు. తెలుగుభారతి సేవా సమితి అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు సోమవరపు సుబ్బరాయుడు, అన్నపురెడ్డి పెద వెంకటరెడ్డి, గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, డాక్టర్‌ పీఎస్‌బీ శ్రీనివాసులు, యానాదిరెడ్డి, రమణయ్య, కుడుముల సుధాకర్‌రెడ్డి, రవీంద్రకుమార్‌, విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పతీతమ్మకు పొంగళ్లు



ఆత్మకూరురూరల్‌: మండలంలోని రామస్వామిపల్లిలో పతీతమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పతీతమ్మ ఉత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం మహిళా భక్తులు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

ఉత్సాహంగా 2కే రన్‌



బుచ్చిరెడ్డిపాళెం రూరల్‌: పట్టణ పరిధిలో ఆదివారం నిర్వహించిన 2కే రన్‌ ఉత్సాహంగా సాగింది. స్థానిక డీఎల్‌ఎన్నార్‌ పాఠశాల నుంచి చెన్నూరురోడ్డు, వైఎస్సార్‌ విగ్రహం, జొన్నవాడ సెంటర్‌ మీదుగా తిరిగి పాఠశాల వరకు 2కే రన్‌ విజయవంతంగా సాగింది. సీఐ శ్రీనివాసులురెడ్డి, నగర కమిషనర్‌ బాలకృష్ణ, తహసీల్దార్‌ వెంకటేశ్వర్లు, ఎస్సై సంతోష్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి పాల్గొని మాట్లాడారు. శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ప్రతిఒక్కరూ ఏదోక వ్యాయామం చేయాల్సిన అవసరముందన్నారు. ప్రస్తుతం వ్యాయామాన్ని మన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు కల్యాణ్‌ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అవతారోత్సవాలు



నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో భగవద్రామానుజాచార్యుల వారి 1,008 అవతార మహోత్సవాలను విశేషంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం తిరుమంజనం, సాయంత్రం మంగళ శాసనోత్సవం, రాత్రి పేట ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

హెచ్‌ఎంకు సన్మానం



నెల్లూరు (టౌన్‌) : దర్గామిట్టలోని మున్సిపల్‌ పాఠశాలలో హెచ్‌ఎం మచ్చ మల్లేశ్వరి ఉద్యోగ విరమణ సభను ఆదివారం నిర్వహించారు. మల్లేశ్వరి దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించి ఆమె సేవలను కొనియాడారు.

చిత్రకళలో ఉచిత శిక్షణా తరగతులు

ఉదయగిరి: పట్టణానికి చెందిన ఆర్టీసీ కండక్టర్‌, చిత్రకారుడు వై సుదర్శన్‌ ఆధ్వర్యంలో మే 2వ తేదీ నుంచి చిత్రకళలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 30న విద్యార్థులు, తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి వచ్చిన విద్యార్థులను కేటగిరీల వారీగా విభజించి సమయానుకూలంగా శిక్షణా తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడిగా కే చక్రపాణి



చక్రపాణి



ఎన్‌ రిషికుమార్‌

కావలి: కావలి బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడుగా కే చక్రపాణి ఎన్నికయ్యారు. పట్టణంలోని బార్‌ అసోసియేషన్‌ కార్యాలయంలో బార్‌ అసోసియేషన్‌ నూతన కార్యవర్గ ఎన్నికను ఆదివారం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా ఎన్‌ రిషికుమార్‌, ఉపాధ్యక్షుడిగా వై అరుణ్‌కుమార్‌, సంయుక్త కార్యదర్శిగా షేక్‌ నాయబ్‌ రసూల్‌, లైబ్రరీ కార్యదర్శిగా జీఆర్‌కే శర్మ, కార్యనిర్వాహక సభ్యులుగా అభిసాగర్‌, యు జయలక్ష్మిని ఎన్నుకున్నారు.

పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయం



సీతారామపురంలో నిరసన తెలుపుతున్న రాజకీయ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు



మర్రిపాడులో..

సీతారామపురం: కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడికి పాల్పడడం హేయమైన చర్యని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు ఖండించారు. ఉగ్రదాడులకు నిరసనగా సీతారామపురంలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. ఉగ్రదాడిలో అశువులు కోల్పోయిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాదులు పర్యాటకులను బలితీసుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మతాన్ని అడ్డు పెట్టుకుని అమాయక ప్రజల మీద చేస్తున్న దాడులను అందరం కలిసికట్టుగా ఎదుర్కోవాలని, ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అంతం చేయడమే భారతీయుల లక్ష్యం కావాలన్నారు.

మర్రిపాడు: కాశ్మీర్‌ లోయలో పర్యాటకులపై ఉగ్రదాడిని ఖండిస్తూ మర్రిపాడులోని బస్టాండ్‌ సెంటర్‌లో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. కొవ్వొత్తులతో ఉగ్రదాడిలో అశువులుబాసిన పర్యాటకులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు మూలి వెంగయ్య మాట్లాడుతూ ఉగ్రవాదులు అమాయక పర్యాటకులపై దాడులు చేసి ప్రాణాలను బలితీసుకోవడం పిరికిపంద చర్య అన్నారు. పర్యాటకులపై దాడికి పాల్పడిన ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. టీడీపీ నాయకుడు ఆరికట్ల పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన తరగతులు

సోమశిల: అనంతసాగరంలోని గ్రంథాలయంలో సోమవారం నుంచి జూన్‌ 6వ తేదీ వరకు వేసవి విజ్ఞాన తరగతులను నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి నారాయణరావు ఆదివారం తెలిపారు. శని, ఆది, సోమ, మంగళవారాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. 3 నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు వేసవి విజ్ఞాన తరగతులకు హాజరయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

మండే ఎండలతో జాగ్రత్త

- పెరిగిన ఉష్ణోగ్రతలు
- పది గంటలు దాటితే అడుగు బయట పెట్టలేని పరిస్థితి
- ఉక్కపోతతో అల్లాడుతున్న వృద్ధులు
- వడదెబ్బతో ప్రాణాలు పోయే ప్రమాదం
- జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్న వైద్యులు



మధ్యాహ్నం వేళ ఎండ తీవ్రతతో బోసిపోయిన వింజమూరులోని మెయిన్‌రోడ్డు

ఉదయగిరి: సాధారణంగా మే నెలలో ఎండలు విపరీతంగా ఉంటాయి. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఏప్రిల్‌ నుంచే ఎండలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. పర్యావరణ విధ్వంసంతో వాతావరణంలో వచ్చే మార్పులు తాపానికి కారణమవుతున్నాయి. పచ్చని చెట్లు తగ్గి భూగోళం వేడెక్కడంతో ఏప్రిల్‌లోనే ఎండలు మండిపోతున్నాయి. సాధారణ ఉష్ణోగ్రతలకంటే రెండు మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. మెట్టప్రాంతమైన ఉదయగిరిలో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉంది. వడగాలులు వీస్తున్నాయి. ఉదయం పది గంటలు దాటితే ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. వృద్ధులు, పిల్లలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ తగిలేది ఇలా..

సాధారణంగా మనిషి శరీరంలో ఐదు లీటర్ల వరకు నీరు ఉంటుంది. సాధారణ శరీర ఉష్ణోగ్రత 35 డిగ్రీలు ఉంటుంది. బయట వాతావరణంలో ఉష్ణోగ్రత శరీరంలో కంటే ఎక్కువగా ఉన్నప్పుడు చల్లబడేందుకు అసంకల్పిత ప్రతీకార చర్యగా నీరు చెమట రూపంలో బయటకొచ్చి సమతుల స్థితికి చేరుస్తుంది. చెమట బయటికి రాకున్నా శరీరంలోని నీరు ఆవిరి అవుతూనే ఉంటుంది. ఈ ప్రక్రియను మనం గుర్తించలేము. ఇలా బయటకు వెళ్లే నీటిని ఎప్పటికప్పుడు భర్తీ చేయాల్సి ఉంటుంది. ఆలస్యమయ్యే కొద్దీ జీవప్రక్రియ మందగించి ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉంటుంది.

వడదెబ్బ లక్షణాలు

వడదెబ్బ తగిలితే తలనొప్పి, తల తిరగడం, శరీరంలో నీరు తగ్గిపోవడం, ఎండిపోయిన చర్మంతో ఎక్కువ జ్వరం రావడం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్‌ వంటి లక్షణాలు కనిపిస్తాయి. మనిషి అపస్మారక స్థితిలోకి వెళ్లే అవకాశం ఉంటుంది. బీపీ తగ్గడం వల్ల బ్రెయిన్‌, కిడ్నీలు పాడై ప్రాణాలు పోయే అవకాశం కూడా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

➡ వేసవిలో సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం పూట ఎండలో తిరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంట్లోనే ఉండడం మంచిది.

➡ తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే ఉప్పు కలిగిన మజ్జిగ లేదా పళ్లరసాలు, నిమ్మరసం, కొబ్బరి నీరు, మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి.

➡ వేసవిలో తెల్లని దుస్తులు ధరించాలి. బాగా వదులుగా ఉండే కాటన్‌ దుస్తులు ధరిస్తే మంచిది. నల్లని దుస్తులు ఎట్టి పరిస్థితుల్లో ధరించకూడదు. ఎండలో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వేసుకుని లేదా తలకు క్యాప్‌, టవల్‌ను ధరించి వెళ్లాలి.

వెంటనే వైద్యం అందించాలి



వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా నీడ ప్రాంతానికి చేర్చాలి. శరీరంపై దుస్తులను తొలగించి చల్లని నీటిలో ముంచిన గుడ్డతో తుడవాలి. ఐస్‌ముక్కలను గుడ్డలో ఉంచి శరీరం అంతా రుద్దితే మంచిది. బాధితుడితో చల్లని నీరు లేదా ఉప్పు, ఇతర లవణాలు కలిపిన నీటిని తాగించాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తికి నీరు తాగించకూడదు. వెంటనే వైద్యుడికి చూపించి తగిన చర్యలు చేపట్టాలి. వడదెబ్బకు గురికాకుండా ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను అందజేస్తున్నాం.

– కార్తీక్‌, వైద్యాధికారి, వింజమూరు సీహెచ్‌సీ